క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

అలరించిన కోలాటం



కోలాటం ఆడుతున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీవారి భక్తులు నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో అలరించింది. సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

ఆనందపురం : సెల్యూట్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఆనందపురం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారని కోచ్ సాయి కుమార్ తెలిపారు. కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఐదేళ్ల వయసు విభాగంలో సాత్విక్ బంగారు, కాంస్య పతకాలు, ఆరేళ్ల విభాగంలో రేవంత్ కుమార్ కాంస్య పతకం, ఏడేళ్ల విభాగంలో రూసెల్ కాంస్య పతకం, 11 ఏళ్ల విభాగంలో ప్రణీత్ రెండు వెండి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో 12 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



రేవిడిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం సమితి ప్రతినిధులు

పద్మనాభం: త్రైత సిద్ధాంత భగవద్గీత హిందూ ప్రచారంలో భాగంగా ఆదివారం ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ ఆధర్యంలో మండలంలోని రేవిడి, రైతులపాలెంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ పరమాత్మ భూమిపై భగవంతుని (శ్రీకృష్ణుడు) రూపంలో జన్మించి గురువయ్యాడన్నారు. మనిషిగా జన్మించిన దేవుడినే గురువుగా భావించాలన్నారు. సమితి సభ్యులు కె.మధు, టి.మంగమ్మ, కె.రాజు, కె.బంగారుతల్లి, సత్యవతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వావ్... బుక్ కేఫ్



వ్యర్థాలతో తీర్చిదిద్దిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్



పాత సామగ్రితో రూపొందించిన ఫర్నిచర్, గ్రంథాలయం

- పాత టైర్లు, ఇనుప సామగ్రితో ఆకర్షణీయ కేంద్రం ఏర్పాటు
- తగరపువలస గ్రంథాలయ వీధిలో ప్రారంభానికి సిద్ధం

తగరపువలస: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీవీఎంసీ పరిధిలోని ప్రతీ జోన్‌లో రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పేరుతో ఒక సెంటర్ తయారు చేస్తున్నారు. వీటిని ఆయా ప్రాంతాల ప్రాధాన్యతను బట్టి పిల్లలు, యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు. భీమిలి జోన్‌కు సంబంధించి తగరపువలసలోని జీవీఎంసీ గ్రంథాలయం ఎదురుగా యువతను దృష్టిలో పెట్టుకుని ఈ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ రూపుదిద్దుకుంది. దేశవ్యాప్తంగా 115 పట్టణాల్లో ఇలాంటి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు వెలిశాయి. స్థానికంగా ప్రజలు వినియోగించి వదిలేసిన దుస్తులు, ఫర్నిచర్, పుస్తకాలు, కాగితాలు, టైర్లు, పాత ఇనుప సామగ్రి, వంటపాత్రలు, బాటిళ్లను ఇక్కడ అప్పగిస్తే కొంత మొత్తం నగదు ఇచ్చేలా ప్రతిపాదన కూడా ఉంది. ఇలా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అప్పగించిన పాత సామగ్రితో సెంటర్‌లో వినియోగించుకునేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి బుక్ కేఫ్‌గా నామకరణం కూడా చేశారు.

యూత్‌ను కట్టిపడేసేలా...

వారం రోజుల్లో ప్రారంభం కానున్న తగరపువలస ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ లోపల, వెలుపల పెయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. బయటి ప్రాంతంలో పాత టైర్లకు రంగులు వేసి పూలకుండీలుగా వినియోగంలోకి తీసుకొచ్చారు. లోపల యువతకు పనికొచ్చేలా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అరల బీరువాలో పొందుపరిచారు. వీరు కూర్చుని చదుకునేలా ఆయిల్ డ్రమ్ములతో టేబుళ్లు, టైర్లతో కుర్చీలు, అల్మరాలు తీర్చిదిద్దారు. పాత సైకిళ్లు, వాటి విడి భాగాలు, స్కూటర్ విడి భాగాలకు రంగులు వేసి వాటిని విద్యుత్ దీపాలుగా అలంకరించారు. డ్వాక్రా మహిళల ద్వారా ఆర్‌వో ప్లాంట్, సెంటర్‌కు వచ్చేవారికి కాఫీ ప్లాంట్‌ను దీనికి అనుసంధానం చేశారు. ప్రస్తుతం కేంద్రానికి అవసరమైన రీసైక్లింగ్ ద్వారా తయారు చేసిన వస్తువులు కొన్నింటిని నాగ్‌పూర్ నుంచి రప్పించగా మిగిలినవి ఇక్కడే ఇండియన్ యూత్ ఫర్ సొసైటీ ద్వారా తయారు చేయిస్తున్నారు. ఈ సెంటర్ ప్రారంభమైతే కనీసం 10 శాతం మంది ప్రజలు స్పందించి ఇంట్లో వినియోగించి వదిలేసిన వస్తువులను ఇక్కడికి అప్పగిస్తే యువతకు ఉపయోగకరంగా ఉంటుందని విద్యావంతులు భావిస్తున్నారు.



సైకిల్ రిమ్ముతో తయారుచేసిన లైటు



సైకిల్, స్కూటర్ హ్యాండ్ వ్యర్థాలతో లైట్లు



పాత టైర్లతో కుర్చీలు, టేబుల్ సెట్

చురుగ్గా పూడికతీత పనులు

పీఎం పాలెం : పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే రోడ్డులోని ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను ఆదివారం జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది పొక్లెయిన్ సాయంతో తీయించారు. కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది వైపునకు వెళ్లే సర్వీసు రోడ్డులోని డ్రైన్లలో పూడిక తీత పనులు పూర్తి చేశామని జెడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

ఈ ప్రాంతంలో ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారని... ఆయన ఆదేశాలతో పూడిక తొలగింపు పనులు చేపట్టామని జెడ్సీ తెలిపారు.



పీఎం పాలెంలోని డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

నోటి ఆరోగ్యంతో రోగాలు దూరం

కొమ్మాది: నోటి ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపరచడంలో భాగంగా గీతం దంత కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లో ఆదివారం చైతన్యనడక, ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఆగస్టు 1న నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గీతం దంత కళాశాల పెరియోడాంటిక్స్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ వై.రవిశంకర్ మాట్లాడుతూ నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా రోగాల నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చన్నారు. పొగాకు సంబంధ ఉత్పత్తులకు దూరంగా ఉండడం, దంత సంరక్షణ, తరచూ బ్రష్‌లను మార్చడం, తియ్యటి పదార్థాలు తినడం తగ్గించుకోవడం, తాజా పళ్లు తినడం, ఎప్పటికప్పుడు దంత వైద్యులను సంప్రదించడం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చని సూచించారు.

రోజు విడిచి రోజు తాగునీరు

తగరపువలస: గోస్తనీ నదిలో బురద నీరు ప్రవహిస్తుండడంతో జీవీఎంసీ భీమిలి జోన్‌లో తాగునీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు నదికి వరద నీరు పోటెత్తడంతో నదిలోని ఊటబావుల్లో బురద నీరు చేరుతోంది. దీంతో రిజర్వాయర్లలో ఒక రోజు నీటిని నిల్వ చేసి తేరిన తర్వాత మరుసటి రోజు ఆ నీటిని విడుదల చేస్తున్నారు. ఎండలకు నదిలో బురదనీరు తగ్గుముఖం పడితే తప్ప రోజూ తాగునీరు సరఫరా చేయలేమని సిబ్బంది చెబుతున్నారు. ఆదివారం పాక్షికంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు కొన్ని ప్రాంతాలకే సరఫరా చేయడంతో మిగిలిన గ్రామాల వారు ఇబ్బంది పడ్డారు.

అధ్వాన రోడ్లపై రాకపోకలకు ఇక్కట్లు



పంతులు గారి తోటలో గోతులమయమైన రోడ్డు



రాళ్లు తేలిన బాలికల వసతి గృహం రోడ్డు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాలు కురిస్తే చిత్తడిగా మారుతున్నాయి. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆనందపురం భూలోక మాత గుడికి సమీపంలోని పంతులు గారి తోటలో నివాసాల మధ్య ఉన్న రోడ్డు పూర్తిగా పాడైంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి అందులో నిండా నీరు చేరుతోంది. దీనివల్ల ఈ మార్గంలో కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ సుమారు వంద వరకు నివాస గృహాలున్నాయి. ఆ గృహాలన్నింటికీ ఇదే ప్రధాన రహదారి. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆనందపురం – బోని రోడ్డు నుంచి ప్రభుత్వ బాలికల వసతి గృహం వరకు నిర్మించిన రోడ్డు కొట్టుకుపోయింది. కొండవాలు ప్రాంతం కావడంతో వరద నీరు ప్రవహించడంతో పూర్తిగా కొట్టుకుపోయి రాళ్లు మొనతేలాయి. ఇక్కడ సుమారు 80 నివాస గృహాలు ఉన్నాయి. అందరికీ ఇదే ప్రధాన మార్గం. ఈ రూట్లో ప్రయాణించే విద్యార్థులు, స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ రోడ్డు సమస్య చాలా కాలంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

మురుగునీటితో రోగాలు

తగరపువలస: జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ, ఐటీ పార్కు రోడ్డు, అల్టీయస్ అపార్ట్‌మెంట్ పడమర దిశ డ్రైనేజీలో డెబ్రిస్ కారణంగా మురుగునీరు నిలిచిపోయింది. దీంతో మా కుటుంబ సభ్యులతోపాటు ఇరుగు పొరుగు కుటుంబాల వారు అనారోగ్యానికి గురవుతున్నారు. వృద్ధాప్యం కారణంగా సమస్యలు భరించలేకపోతున్నాం. డ్రైనేజీలో పేరుకుపోతున్న డెబ్రిస్ తొలగించి, మురుగునీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు సచివాలయం, మధురవాడ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశాం. దీనిపై జీవీఎంసీ అధికారులు స్పందించి డెబ్రిస్, మురుగు నుంచి రక్షణ కల్పించాలి.

– డి.సత్యమూర్తి, విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, మిథిలాపురి వుడా కాలనీ.

హక్కులతోపాటు బాధ్యతలూ తెలుసుకోవాలి


భీమునిపట్నం: పౌరులకు హక్కులతోపాటు బాధ్యతలూ ఉంటాయని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు అంతా సద్వినియోగం చేసుకోవాలని సీఐ రమేష్ సూచించారు. ఆదివారం భీమిలి రెల్లివీధిలో పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎలా వినియోగించుకోవాలి, బాధ్యతలు గుర్తించడంపై వివరించారు. ఇతరుల హక్కులకు భంగం కలగకుండా నడుచుకోవాలని సూచించారు.

యువత వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చురుగ్గా బయోమెట్రిక్

మధురవాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు బయోమెట్రిక్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే నెల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి వారి వివరాలన్నీ టీహెచ్‌ఆర్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియలో అంతా తలమునకలై ఉన్నారు. ఇందులో భాగంగా ప్రతీ లబ్ధిదారుకీ నెలకు 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, అర లీటర్ నూనె, కిలో పప్పు, కిలో రైస్ చొప్పున ప్రతి నెలా అందించనున్నారు. గుడ్లు, పాలు రెండు విడతల్లో, మిగిలిన సరకులు ఒకేసారి ఇచ్చేస్తారు. భీమిలి నియోజకవర్గం పరిధిలో 46 కేంద్రాలు ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లో బయోమెట్రిక్ పనులు జరుగుతున్నాయని, లబ్ధిదారులు బయోమెట్రిక్ నమోదు చేయించుకుని సరకులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీదేవి సూచించారు.

ప్రమాదకరంగా గోస్తనీ వంతెన రెయిలింగ్



శిథిలమైన గోస్తనీ నది వంతెన రెయిలింగ్

పద్మనాభం: పద్మనాభం గ్రామానికి సమీపంలోని గోస్తనీ నది వంతెన రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా మారింది. దీంతో పాదచారులు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. 2014 అక్టోబర్‌లో సంభవించిన హుద్‌హుద్ తుపాన్‌కు ఈ వంతెన రెయిలింగ్ శిథిలమైంది. కొన్నిచోట్ల రెయిలింగ్ శిథిలమై ఇనుప ఊచలు పైకి కనిపిస్తున్నాయి. దీంతో పాదచారులు, పాఠశాల విద్యార్థులు వంతెన పైనుంచి వంగి నది అందాలు తిలకించేటప్పుడు పడిపోయే ప్రమాదముంది. ఈ వంతెన పైనుంచి విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, ఆటోలు, లారీలు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. డ్రైవర్లు ఏమరుపాటుగా ఉంటే వాహనాలు నదిలోకి పల్టీ కొట్టి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదముంది. రెయిలింగ్ శిథిలమై ఎనిమిదేళ్లు దాటుతున్నా పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆదేవన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి

కలెక్టర్ మల్లికార్జున



మధురవాడ వసంత విహార్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మధురవాడ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది రిక్షా కాలనీ, వసంత విహార్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటా ఓటరు సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు డోరు టు డోర్ సర్వేపై అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఓటు నమోదు చేయించుకున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా నమోదు చేయించుకుని ఎన్నికల్లో భాగస్వాములు కావాలని కోరారు. సవరణలు కావాలనుకునే వారు ఫారమ్ 8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, చనిపోయిన వారి ఓట్లు విచారణ తర్వాత తొలగించాలని సిబ్బందికి చెప్పారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుపై బూత్ లెవెల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి పరిధిలో ఉన్న కాలేజీల్లో కూడా ఓటు హక్కులేని వారి వివరాలు నమోదు చేయించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. కుటుంబంలోని సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో నమోదయ్యేలా చూడాలని బీఎల్‌వోలు, అధికారులను ఆదేశించారు. అర్బన్ ప్రాంతంలో 1400, రూరల్‌లో 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం కొత్త బూత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను బూత్‌లుగా వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాను అధికారులతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించి మార్పులు ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం ఇక్కడ వీధిలైట్లు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరగా దానిపై కలెక్టర్ మల్లికార్జున సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య, ఏఈఆర్‌వో నరేంద్రనాథ్ రెడ్డి, సూపర్‌వైజర్ కల్యాణి, శ్రీహరి, మల్లేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రాత్రి పది గంటల్లోగా షాపులు మూయకుంటే చర్యలు



బీచ్‌రోడ్డులో దుకాణదారుడితో మాట్లాడుతున్న భీమిలి సీఐ రమేష్

భీమునిపట్నం: భీమిలిలో రోజూ దుకాణాలను రాత్రి పది గంటలలోపు మూసివేయాలని సీఐ డి.రమేష్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం షాపుల వద్దకు వెళ్లి సమాచారాన్ని తెలిపారు. ఇక్కడి పెద్దబజారు, చిన్నబజారులోని షాపులు, బీచ్‌రోడ్డులో ఉన్న తినుబండారాలు, ఇతర షాపుల నిర్వాహకులతో మాట్లాడి తప్పనిసరిగా నిర్దేశించిన సమయంలోగా మూసివేయాలని తెలిపారు. చాలా దుకాణాలు పది గంటల తర్వాత కూడా తెరిచి ఉండడంతో మద్యం సేవించే వారు రోడ్లపై తిరుగుతున్నారని, దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా బడ్డీ కొట్లల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీచ్‌తోపాటు ఇతర బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. సమస్యలుంటే తమను సంప్రదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అధికారం కోసం చవకబారు ప్రచారం తగదు

కళ్లుండీ చూడలేని కబోదుల్లా జనసైనికులు



నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్లు చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు లక్షలాది ఇళ్లు నిర్మించి ఆదుకుంటుంటే ప్యాకేజీ జనసేన నాయకులు కళ్లుండీ చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం మండిపడ్డారు. మండలంలోని తంగుడిబిల్లిలో ఆరు వందల ఎకరాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీని వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బంక సత్యం మాట్లాడుతూ వర్షాలు కురిస్తే పల్లం ప్రాంతంలో నీరు నిలవడం సహజమని... వర్షం తగ్గిన వెంటనే సాధారణ స్థితి నెలకొంటుందన్నారు. కానీ జనసేన నాయకులకు ఎక్కడో గుంతల్లో ఉన్న నీరు కనబడుతోంది తప్ప వేలాది మందికి సమకూరుతున్న నివాసాలు కానరాకపోవడం శోచనీయమన్నారు. అధికారం కోసం ఇలాంటి చవకబారు ప్రచారాలు చేస్తే ఇప్పటికే రెండు సార్లు జనం ఇంటికి పంపించారని మూడోసారి కూడా అన్నీ సర్దుకొని జనసేన ఇంటికి పోవడానికి సిద్ధంగా ఉండాలని ఎద్దేవా చేశారు. స్థలాలు సమకూర్చి, బిల్లులు చెల్లించి పాఠశాలలు, వైద్యశాలలు నిర్మించి, రోడ్లువేసి, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించి గ్రామాలనే నిర్మిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి ప్యాకేజీ పార్టీ నాయకులకు లేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి కలిసి వస్తే ప్రజలు విశ్వసిస్తారని, ఇప్పటికైనా జనసేన నాయకులు పేదల అభివృద్ధిని కోరుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, గండిగుండం సర్పంచ్ గంట్రెడ్డి శ్రీనివాస్, నాయకులు మజ్జి వెంకటరావు, లెంక రాంబాబు, బొట్టా రామకృష్ణ, రౌతు వెంకటరావు, కోరాడ ముసిలినాయుడు, కోన శ్రీను, పడాల రాము, పప్పల శ్రీకాంత్, పైడిరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవాభావం



స్నేహితురాలు చిప్పాడ వెంకటరత్నంకు సరకులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1991 – 92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సాయంత్రం రాజవీధిలోని తమ క్లాస్‌మేట్ చిప్పాడ వెంకటరత్నంకు నిత్యావసర సరకులు అందించారు. మరో స్నేహితుడు రాయవరపు వెంకటరావు కుమార్తె దివ్య పుట్టిన రోజు సందర్భంగా ఈ సరకులు అందించినట్టు తెలిపారు. అనంతరం అస్వస్థత కారణంగా ఇంటి వద్ద ఉండి చికిత్స పొందుతున్న పల్లా అప్పారావు అనే మరో స్నేహితుడిని పరామర్శించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వర్మ, వైస్ ప్రెసిడెంట్ హేమ చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్బారావు, సహాయ కార్యదర్శి పిట్టా శ్రీనివాసరెడ్డి, కోశాధికారి కంబపు శ్రీనివాసరెడ్డి, గౌరవ సలహాదారుడు గోవాడ సురేష్‌కుమార్, సభ్యులు వై.ప్రతాప్‌సింగ్, కుంచం కామేష్, బోర శంకరరెడ్డి, అరవింద్, వాకాడ రమణ పాల్గొన్నారు.

మధ్యాహ్నమైతే మూసేస్తున్నారు..!



రుషికొండలో తాళాలు వేసి ఉన్న పబ్లిక్ టాయిలెట్

కొమ్మాది: బీచ్‌రోడ్ రుషికొండలో గల పబ్లిక్ టాయిలెట్ ఒక పూట మాత్రమే తెరిచి ఉంటోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తెరిచి ఉంచి అక్కడితో మూసివేయడంతో పలువురు పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే సాగర్‌నగర్‌లో పబ్లిక్ టాయిలెట్‌లు మూసి ఉండడంపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ నిర్వాహకుల్లో చలనం ఉండడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.